నమ్మలేని నిజాలు

జనం బెంబేలు
రాకాసికోర భయం
బస్తి సింహాలు.

నేడు మైదానం
పులులు లేని వనం
వనవిలాపంజ.

దూరతీరాలు
బంధాలకు చేరువ
దారిమారింది.

దొంగల ముఠా
దొరకదు చిక్కదు
దర్జా దొరలు.

అడ్డుగోడలు
కుటుంబ కలహాలు
దూదిపింజలు.

- రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

శ్రీ నిజాలు

అకాల వానకు గజగజ
వణికి పోయె తెలంగాణ !
ప్రకృతిపగతో కొట్టింది
రైతు నోట్లె రాళ్ళవాన !.

శోభకృత్ ఉగాది పర్వ
దినం పలికేనా శుభం ?
పూర్తిగా పోగొట్టెనా
జనంలోన ఉన్న భయం ?

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ | బుధవారం 22-3-2023 | RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :29 | సంచిక: 170 | పేజీలు:6 | వెల: రూ.1/-


## సీఎం కేసీఆర్ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి : మంత్రి ఎర్రబెల్లి

వరంగల్, మార్చి 21: ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ సందేశాన్ని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణా భివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు ఘనంగా నిర్వహించా లని సూచించారు. మంగళవారం దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో పెరిగిన పెట్రోల్ ధరలతో పాటు నిత్యవసర సరుకుల ధరలు, మోదీ ప్రభుత్వ విధానాల వైఫల్యాలు ప్రచారం చేయాలని మంత్రి కోరారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అటు దేశ ప్రజలతో పాటు, తెలంగాణ రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాలను వివరించాలని సూచించారు.

పార్టీకి కార్యకర్తలే దేవుళ్లని వారిని కాపాడుకోవలసిన బాధ్యత పార్టీ ప్రతినిధులపై ఉందని అన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు గ్రామాలు, మండలాలు, నియోజకవర్గ స్థాయిల వారీగా నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనాలు, వాటి ఏర్పాట్లపై చర్చించారు. ఈ సమీక్షలో ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, జడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షులు,ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, ఎమ్మెల్యేలు రాజయ్య, ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, వొడితెల సతీశ్ కుమార్, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు వాసుదేవ రెడ్డి,నాగుర్ల వెంకటేశ్వర్లు, మార్నేని రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో నిత్య వసంతం.. ఉగాది శుభాకాంక్షలు తెలిపిన సీఎం కేసీఆర్



హైదరాబాద్, మార్చి 21: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ శోభకృత్ నామ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ సంవత్సరంగా పరిగణించే ఈ ఉగాది రైతులకు, ప్రజలకు అన్ని రంగాల్లో శుభాలను చేకూర్చాలి అని సీఎం ఆకాంక్షించారు.

తాగు, సాగునీరు, పచ్చని పంటలతో తెలంగాణలో నిత్య వసంతం నెలకొంది అని తెలిపారు. వ్యవసాయ రంగ అభివృద్ధితో అనుబంధ రంగాలు, వృత్తులు బలపడి రాష్ట్రంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైంది. తెలంగాణ ప్రగతి దేశానికే ఆదర్శంగా నిలిచింది. శోభకృత్ నామ సంవత్సరంలో తెలంగాణతో పాటు దేశం మరింత అభివృద్ధి సాధించాలి అని కేసీఆర్ ఆకాంక్షించారు.

## రైతులకు అధిక రుణాలివ్వాలి.. బ్యాంకర్లకు మంత్రి నిరంజన్‌రెడ్డి సూచన

హైదరాబాద్, మార్చి 21:రైతులకు అధిక రుణాలిచ్చి ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి బ్యాంకర్లకు విన్నవించారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనతి కాలంలోనే తెలంగాణ దేశ వ్యవసాయరంగంలో అగ్రగామిగా ఎదిగిందన్నారు.

రాష్ట్రంలో వ్యవసాయరంగ అభివృద్ధితో పంట ఉత్పత్తులు భారీగా పెరిగాయని, అందుకు తగ్గట్లుగా ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు విరివిగా రుణాలివ్వాలని కోరారు. రాష్ట్రంలో పంటల మార్పిడికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తుందన్నారు. బ్యాంకర్లు ఆయిల్ ఫామ్‌సాగుకు రుణాలు అందిలని సూచించారు.

డెయిరీ రంగం బలోపేతం చేసేందుకు అధ్యయనం చేసి ప్రణాళికాబద్ధంగా సహకరించాలన్నారు. బ్యాంకులు కేవలం పట్టణాలలోని ఆస్తులు, భూములనే ప్రామాణికంగా తీసుకుంటున్నాయన్నారు. ఈ విధానాన్ని మార్చుకోవాలని సూచించారు.

విదేశాలకు వెళ్లే విద్యార్థులకు ఇచ్చే విదేశీ విద్య బ్యాంకు రుణాల గరిష్ట పరిమితిని రూ.7.5 లక్షల నుంచి పెంచాలన్నారు. తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ అనుకూల విధానాల మూలంగా గ్రామీణ ప్రాంతాల భూముల పెరిగిన ధరలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

2022 – 23 సంవత్సరానికి గాను వ్యవసాయ రంగానికి బ్యాంకులు ఇచ్చే రుణాల లక్ష్యంలో 62 శాతమే పూర్తయిందని, ఈ విషయంలో బ్యాంకులు మరింత ఉదారంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఆర్థిక శాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్, ఎస్ఎల్‌బీసీ అధ్యక్షుడు అమిత్ జింగ్రాన్, జీఎం నాబార్డ్ డాక్టర్ వై.హరగోపాల్, ఆర్‌బీఐ డీజీఎం కేఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## 80 శాతం భూ జీవవైవిధ్యానికి అడవులే ప్రధాన కారణం : ఎంపీ సంతోష్ కుమార్



హైదరాబాద్, మార్చి 21:మానవ మనుగడలో అడవుల పాత్ర ఎంతో కీలకమైంది. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ అభివృద్ధికి అడవులు ఎంతో దోహదపడతాయి. ఇది గ్రహించిన తెలంగాణ ప్రభుత్వం అడవుల రక్షణ, పెంపకంపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్న విషయం తెలిసిందే. 'హరితహారం' కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా చెట్ల పెంపకంకై నడుం బిగించింది. కాగా, ప్రపంచంలోని 80శాతం భూ జీవవైవిధ్యానికి అడవులే ప్రధాన కారణమని ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ అన్నారు. నేడు ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా ఆయన ఓ ట్వీట్ చేశారు.

'ప్రపంచంలోని 80శాతం భూ జీవవైవిధ్యానికి అడవులే ప్రధాన కారణం. అందులోని ప్రతి బిట్‌ను సేవ్ చేయడానికి మనం చేతులు కలపాల్సిన సమయం ఆసన్నమైంది. అడవులు లేకపోతే ఈ భూమి ఓ నిర్జీవంతో సమానం. గౌరవనీయులైన ముఖ్యమంత్రి కేసీఆర్ సర్.. హరితహారం ఎంతో సహకరిస్తోంది' అంటూ ట్వీట్ చేశారు. ఈ మేరకు గతంలో మొక్కలు నాటిన ఫొటోలను ఎంపీ షేర్ చేశారు.

## అడవులను సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నిర్మల్, మార్చి 21: మానవ మనుగడలో అడవుల పాత్ర ఎంతో కీలకమైందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ అభివృద్ధికి అడవులు ఎంతో అవసరమని తెలియజేయడమే ప్రపంచ అటవీ దినోత్సవం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా అటవీ శాఖ కార్యాలయం నుంచి ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తా వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గండిరామన్న హరితవనంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మొక్కలు నాటారు. పార్క్‌లో మంత్రి కూడా సైక్లింగ్ చేశారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ జంగల్ బచావో జంగల్ బడావో నినాదం తో 2015 సంవత్సరంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించారని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. కేవలం ఎనిమిదేండ్ల లోనే 273 కోట్లకుపైగా మొక్కలను నాటి అనుకున్న లక్ష్యాన్ని అధిగమించామని పేర్కొన్నారు. తెలంగాణలో 2015 నుంచి 2021 సంవత్సరాల మధ్య పచ్చదనం శాతం 7.70% పెరిగిందని వెల్లడించారు.

అడవుల పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకొన్న చర్యల ఫలితంగా వన్య మృగాల సంఖ్య గణనీయంగా వృద్ధి చెందిందని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వెల్లడించారు. కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతాల్లో పులుల సంఖ్య పెరిగిందన్నారు. పొరుగున ఉన్న మహారాష్ట్ర లోని తడోబా-అంధేరి టైగర్ రిజర్వ్ నుంచి పులులు మన అవాసాలకు వసున్నాయని, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కవ్వాల్ టైగర్ జోన్‌తో పాటు, ప్రాణహిత, పెన్‌గంగ సరిహద్దు ప్రాంతాల్లో పులుల సంచారం బాగా పెరిగిందని చెప్పారు. అడవులను సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అడవులను నరికి వేస్తే భవిష్యత్ కాలంలో దుష్పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి అడవులను కాపాడుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల్లో అవగాహన పెరగటం చాలా అవసరం అని, తద్వారా వారు మిగతా సమాజానికి సంధానకర్తల్లా పనిచేస్తారని అన్నారు.

## నటరాజ రామకృష్ణ జీవితం నాట్యానికి అంకితం



అనసూయమ్మ, నర్తకుడు కళాకృష్ణను సత్కరిస్తున్న జస్టిస్ లక్ష్మణ్, రమణాచారి

నటరాజ రామకృష్ణ జీవితం నాట్యకళకు అంకితం చేశారని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. లక్ష్మణ్ అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో నృత్య కిన్నెర, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్యాచార్యులు డా. నటరాజ రామకృష్ణ శతజయంతి సమాపనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత కళాకృష్ణ నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ కె. లక్ష్మణ్ నర్తకుడు కళాకృష్ణను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో రుగ్మతలు పోవాలంటే కళలు, సాహిత్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా॥ కే.వి.రమణాచారి మాట్లాడు తూ.. నటరాజ రామకృష్ణ శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్య క్రమం లో సాహితీవేత్త ఓలేటి పార్వ తీశం, న్యాయవాది వెంకటే శ్వరి, గాయని అనసూయమ్మ, సూర్య నారాయణ గౌడ్, మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు. అనంతరం నర్తకుడు కళాకృష్ణ ను ఘనంగా సత్కరించి అభినందించారు.

# ఆనంద చిత్రమే - చైత్రం

**"కాలరథమ్ము మీదనె జగత్పతి**
**నిత్యము స్వారి చేయునో?**
**కాలరథమ్ము చక్రముల ఘట్టన**
**పుట్టుచు రాలుచుండు కెం**
**ధూళి కణమ్ములే అగునొ తోచెడి**
**ఈ సకల ప్రబాళియున్?**
**'కాల' రహస్యమున్ తెలియగల్గుటె**
**పుట్టుకున్ ఫలమ్మెకో?"**
(బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు).

కాలం వివిధ భాగాలుగా విభాగింపబడి మనముందు కదులుతూ మన ఆయువును హరిస్తూ ? మనని ఆనంద విషాదాల తపింపచేస్తూ ? తరింప చేస్తూ జ్ఞానదాయినిగా నిలుస్తూన్న కాలంలో మాసములతో కదలే వత్సరంలో లేదా సంవత్సరంలో మొదటి మాసం 'చైత్రం'.

**"చిత్ర చిత్రపు పూలు**
**చైత్రమాసపు పూలు**
**ఇంటింట ఊరిలో**
**ఊరికే పూసాయి"** ? అని కవులచే అనిపించుకున్న మాసం చైత్రం.

మనకున్న 27 నక్షత్రాలలో ముత్యంలా ప్రకాశవంతంగా ఉంటే చిత్ర నక్షంత్రంతో కలసి ఉండే మాసం కనుక ఈ మాసానికి చైత్రము లేదా చైత్రమాసమనే పేరు వచ్చింది.

ఈ చైత్రమాసాన్ని ఇంకా చైత్రికము, తొలినెల, ఫాల్గునానుజము మధువు. ముత్తెపు రిక్కనెల. సురభి అని పిలుస్తారు. ప్రతి రోజును ఓ పర్వంగా మార్చిన నెల ఇది.

ఈ చైత్రమాసం మొదటి రోజే మన మొదటి పండుగ. అదే ఉగాది పండుగ. ఉగ అంటే నక్షత్ర గమనం. దీనికి ఆది ఉగాది. యుగాది అనే పేర్లున్నాయి.

యుగం అంటే జంట. ఉత్తర, దక్షిణాయణాల సంయుత యుగం. యుగానికి ఆది (మొదట) ఐనందున చైత్ర శుద్ధ పాడ్యమి (చైత్రమాసపు మొదటి రోజు) యుగాది పండుగ అయింది. అదే ఉగాదిగా మారింది. ఈ ఉగాది పండుగను ఏడాది పండుగ, సంవత్సరాది, సంవత్సర ముఖి అని కూడా పిలుస్తారు. కాలానుగుణంగా ప్రకృతిలో వచ్చే అనేకానేక పరిణామాలకనుగుణంగా మానవ శారీరక మానసిక తత్వాలను దృష్టిలో ఉంచుకుని వాటికి తగిన ఆహారాది నియమాలను సూచించారు మన పూర్వ రుషులు. మానవులు ఆనందంగా ఆరోగ్యంగా జీవితాలను గడపటానికి ఏడాదిలోని ప్రతి దినాన్ని ఓ పండుగగా చేశారు. అలా వచ్చే ప్రప్రథమ పండుగ ఉగాది పండుగ.

నిజానికి నక్షత్ర గమనాన్ని బట్టి, రుతుధర్మాన్నిబట్టి పండుగలను చేయటం జరిగిందంటారు. కాలానుగుణంగా మారే రుతువులలో ఏఏ క్రియా కలాపాలు చేయాలో, ఏ ఏ పదార్థాలు ఆహారంగా స్వీకరించాలో వంటి విషయాలను పూర్వ రుషులు పండుగల ఆచారాల రూపంలో స్థిరపరిచారు. సామాజిక జన జీవన స్థితిగతుల్ని, శీతోష్ణస్థితి గతుల్ని బట్టి ఏర్పడే ఈ పండుగల అంతరార్థము మనిషి ఆనందంగా ఆరోగ్యంగా, క్రమశిక్షణతో ఉండాలన్నదే.

చాంద్రమాన ప్రకారం ఆచరింపబడే పండుగైన చైత్రశుద్ధ పాడ్యమి నాడే ? బ్రహ్మ సృష్టిని ప్రారంభించాడని, అందుకు అనగా ఆయా పనులను చేయటానికి దేవతల్ని నియమించాడని అంటారు. ఇది బ్రహ్మ పురాణోక్తిగా చెప్తారు. సీతారాములు వనవాసానంతరం తిరిగి అయోధ్యకు రావడం, వసు రాజు రాజ్య పదవిని పొందటం, విక్రమార్క శకం ప్రారంభం కావటం ఈ చైత్రశుద్ధ పాడ్యమిని ? చైత్రమాసం మొదటి రోజున ? ఉగాది నాడే జరిగిందట.

తెలుగు వారికిది తొలిపండుగ. ఐనా ఈ పండుగను వేరవేరు రోజుల్లో వేరు వేరు ప్రాంతాలైన కేరళ, పంజాబ్, మహారాష్ట్ర, బెంగాల్ మొదలైన అనేక ప్రాంతాలలో ఉగాది పండుగను చాలా వేడుకగా జరుపుకుంటారు. రుతు సంబంధ పర్వమైన ఈ పండుగతో జీవనరాగం విజ్ఞానవంతంగా వినోదభరితమై సంతసాల వెల్లువౌతుంది. చైత్రశుద్ధ పాడ్యమి (ఉగాది) నాడు రక్తాన్ని శుద్ధి, వృద్ధి చేసే వేపచెట్టు పంచాంగాలలో ఒకటైన వేపపూవును తినడం వంటి విశేషాలెన్నో ఉన్నాయి. వేపపూవుతో కొత్త చింతపండును, కొత్త బెల్లం, నెయి మాత్రమే కలిపి, ఉగాది పచ్చడిని చెయ్యాలని శాస్త్రోక్తి అయినా కొంతమంది ఉగాది పచ్చడిలో గసగసాలు, అరటిపండు, మామిడి ముక్కలు, చెరుకు ముక్కలు మొదలైన వాటిని కూడా కలిపి ఉగాది పచ్చడిని చేస్తారు. ఇవేమి కలుపని, ఉప్పు వాడకూడని ఉగాది పచ్చడే ఔషధ యోగమని, ఔషధ రాజమని పెద్దల మాట. ఐతే యూదులు తమ ఉగాది పండుగ నాడు తేనె ,

ద్రాక్షపండ్లను కలిపి తింటూ శక్తిని ఆనందాన్ని అనుభవిస్తారట. ఈ మన ఉగాది పచ్చడి ఆగామి కాలాన వచ్చే ఆరోగ్య అరిష్టాలను ఎదుర్కొనే విధంగా ఉంటుందని పరిశీలకుల నిశ్చితాభిప్రాయం.

ఉగాది నాడు అనగా చైత్రమాసారంభాన జరిగే మరో ముఖ్య అంశం పంచాంగ శ్రవణం. తిథి వార నక్షత్రయోగ కరణములను కలిపి పంచాంగము అని అంటారు. అనాదిగా జరుగుతున్న ఈ కార్యక్రమం భవితను తెలుపుతుందంటారు. అలా చెప్పే భవిత ఎంతవరకు జరుగుతుందో, ఎంత నిజమో ? అది వారి వారి ఇష్టాలకు వదిలేస్తే ? ఇక్కడి నుండి అంటే ఉగాది నుండే 'ప్రసాదాన' ప్రారంభమౌతుంది. 'ప్రస' అంటే చలి పందిరి. ప్రసాదాన అంటే చలివేంద్రం అన్నమాట. ఇప్పటి నుండే ఎండలధికమై దాహార్తిని పెంచుతాయి. కనుక దాహార్తిని తీర్చే చలివేంద్రాలు ఏర్పాటు చేయబడతాయి.

ఆకులు రాలే శిశిర రుతువు తర్వాత ప్రకృతి శోభతో నిండే వసంతరుతువే వస్తుంది. ఏడాదిలో ఉండే 6 రుతువులలో వసంతరుతువే 'రుతురాజము' అనే పేరు పొందింది. ఈ వసంత రుతువును ఆమని, ఇష్మము, రుతుపతి,




కామసుఖము, కుసుమాగమము, ననకారు, పికబాంధవము, పుష్పకాలము, పుష్పమాసం, పుష్పసమయం, పూదరి, పూవులకారు, మండునెల, మదనం, మధువు, మాధవము, వసంతరుతువు, సురభి వంటి ఎన్నెన్ని పేర్లతోనో పిలుస్తారు. చైత్ర, వైశాఖ మాసాలను కలుపుకునే వసంతరుతువు. అనగా ఈ రుతువు చైత్రమాసపు మొదటి రోజు నుండే మొదలవుతుంది. చూచువారల కనుల ముందు అంతా ఆనందసందోహమే. ఎటు చూచినా ?

పసదనము వంటి ప్రసన్నదనపు అనల
నవల గుంపులు.
కొత్త గళాల కుహ కుహూకూతల కులుకు కోయిలలు
ఝుం ఝుమ్మంచు తిరుగాడు
గడుసు తుమ్మెదల నాద తుంపరలు
డెందాలను విందొనర్చు నవ నవకముల పరిమళాలు.. అలరిస్తాయి

వసంత కాలాన్ని వసంతుడు అని, ప్రకృతిని కాంత అని భావించటం ఏనాడో జరిగింది. కనుకనే ప్రకృతి కాంత ?

"శ్రీకరమ్ముగ రమ్ము మాకు మంగళముల నొసంగ" అంటూ వసంతుణ్ణి పిలిచే కాలం ఈ వసంతకాలం మనసులపై మత్తు చల్లే కాలం. కనులను, పనులను తన్మయింపచేసే కాలం.

అట్టి కాలంలో ? వసంత రుతువులో ? సర్వ ప్రకృతిని ప్రభావితం చేసే ఈ వసంత రుతువును ఎందరో కవులు తమ రచనలలో ప్రస్తావించారు. ప్రస్తుతించారు. తమ అద్భుతభావప్రకటనతో.

చైత్రంలో... వసంత రుతువులో మరో ఆనందహేల వసంతోత్సవాలు. చైత్రశుద్ధ పాడ్యమి అనగా చైత్రమాసంరోజు నుండి తొమ్మిదవ రోజు వరకు సాగే ఈ వసంతోత్సవాలు ఒకనాటి కాలాన అంగరంగ వైభవంగా జరిగేవి. జనాహ్లాదం కోసమే ఈ వాసంతోత్సవాలు అన్నట్టు జరిగేవి. ముఖ్యంగా విజయనగర రాజులు రెడ్డి రాజుల కాలంలో వసంతోత్సవాలు చాలా ఘనంగా నిర్వహించబడేది. ఈ ఉత్సవాలలో కస్తూరి, కర్పూరం అనే సుగంధ ద్రవ్యాలను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకు నేవారట. రెడ్డి రాజులలో ఒకరైన కుమారగిరి రెడ్డి ఈ ఉత్సవాలకోసం అధిక ధనాన్ని వెచ్చించి ఇతర దేశాల నుండి కూడా కర్పూరాన్ని తెప్పించేవాడట. అందుకే అతడికి **"కర్పూర వసంత రాయలు"** అనే పేరు వచ్చిందట. అంతేకాదు

దమనము, మరువము అనే సుగంధభరిత పత్రాలనధికంగా వాడేవారట. అవన్నీ ఆనందానికి, అలంకరణకే కాదు ఆరోగ్య ప్రధానాలు కూడా అంటారు.

వసంతుణ్ణి ఆహ్వానించడానికి ఉద్దేశించబడిన వసంతోత్సవాన్ని వాత్స్యాయనుడు సు వసంతోత్సవాన్ని, మదనోత్సవమని అన్న. ఈ ఉత్సవాల్లో పగటిపూట పూజాదికాలను, రాత్రుళ్ళు నృత్యం సంగీతాదులకు ప్రాధాన్యతనిచ్చే వారు.

అందుకే మేళ కర్తలు వసంతరాగంకకూర్చారట. హరికథా కాలక్షేపాలే కాక క్రీడా వినోదాలు, విద్యా విషయిక చర్చలు, గిష్టులు... ఇలా ఎన్నింటినో నిర్వహించే వారు. ఇంకా ఆధ్యాత్మికకార్యక్రమాలైన శివడోలోత్సవాల వంటి వివిధ ఉత్సవాలను చేసేవారు. ఈ ఉత్సవాల మొదటి రోజైన ఉగాదినాడు కొన్ని ప్రాంతాల్లో నాగళ్ళను పూజించి వాటికి ఎడ్లను పూన్చిఏరువాక సాగితే, మరికొన్ని చోట్ల వివిధాలైన వ్రతాదికాలను చేసేవారు. ఈ చైత్రమాసంలో తొమ్మిదవ రోజున ఈ ఉ త్సవాలు ముగుస్తాయి. ఐతే ఆనాడే శ్రీరామనవమి శ్రీరామనవమి ఉత్సవాలుగా మరో రూపంలో ఈ ఉత్సవాలు ప్రారంభమౌతాయి.

ఈ చైత్రమాసంలో విశేషంగా చెప్పుకోవలసిన మరో అంశం "చైత్ర పూర్ణిమ". పూర్ణిమను పున్నమ, పౌర్ణమాసి అని అంటారు. అయితే ఈ చైత్ర పూర్ణిమను కామమహస్సు, చైత్రావళి, దమనపున్నమ అని అంటారు. చైత్రమాసంలో వచ్చే పూర్ణిమను 'చైత్రీ' అని అంటారు. ఈ మాసంలో ప్రబలంగా ఉండే సూర్య ప్రకాశాన్నందుకుని చంద్రుడు చక్కని వెన్నెల కాస్తాడు. అందునా పౌర్ణమినాడు ఈ వెన్నెల మరింత అందంగా హాయిగా ఉంటుంది. మంచి ఎండ, మంచి వెన్నెల గల ఈ పౌర్ణమాసి మానవుడికి సుఖాన్ని కలిగించే రోజుగా ఉంది కనుక పంచాంగ కర్తలీ పౌర్ణమిని 'మహాచైత్రి' అని అన్నారు. ఇది పలు ప్రాంతాలలో ప్రసిద్ధమైన పర్వదినంగా నిలచింది.

మన గ్రంథాలలో కుబేరుని తోటను చైత్రరథంగా, మన్మథుణ్ణి చైత్ర సఖుడుగా చైత్రసారథిగా చెప్పబడింది. కాగా మన తెలుగు సామెతలలో "చైత్ర వైశాఖాలలో పెళ్ళి కావిళ్ళు"– వంటి సామెతలు వచ్చాయి. ఇలా చైత్రమొక్కటే కాదు.... కాలమెల్ల ఎంతెంతో విలువను, విశిష్టతను కలిగి ఉందని మనం తెలుసుకోవాలి.

***పండుగలనేవి ఆడంబరాన్ని, ఆర్భాటాన్ని ప్రదర్శించేవి కావు. అవి క్రమశిక్షణను, బాధ్యతను, త్యాగగుణాన్ని, పరోపకార గుణాన్ని, ప్రేమతత్వాన్ని అలవాటు చేసుకోమనేవే. అంతేకాదు మనకున్నది పదిమందితో పంచుకోవాలనే సత్యాన్ని మరచి పండుగలను జరుపుకోవటం ఎంతవరకు సమంజసమో? ఆలోచించాలి...మరి పండుగన్న ఏమిటో– బతుకు, మనసు పండిననాడే పండుగని మరువరాదుగా.***



**– రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి**
సెల్: 9866583907




## కవనహారతి

అతివా
అవనితనానివా
అయతనానివే గా
అంతులేని సహనానికి
అసలు చిరునామావి
నెలతా నీవు నేలతనానివే.

అన్నువా అగ్నితనానివ
గుప్పెడు గుండెలో
భూగోళమంత భగ భగ లని
దాచెయ్యగలవు
జ్వలించే జ్వలనంలో
పునీతవై పుష్పించగలవు
నీవు
నిప్పు తానానివే నీరజాక్షి.

గాలితనానివ
కాసింత అనునయపు పవనాలకే
అనదించి విశ్వమంతా సంతోషపు
సమీరాలు చల్లేస్తు సాగే
వదుతీ
వాయుతనానివే
నీవు.

గంగతనానివ
ఎన్ని సుడుగుండాలని దాటేస్తూ
పాపాలని ప్రక్షాళన చేస్తూ
గౌతమివై భాగీరథివై సాగుతూ
ధాత్రి దాహం తీర్చే
జీవధారవైన నారీ నీవు
నీటి తనానివే.

అంచయాన
ఆకాశపు తనానివా
నీ అనురాగం ముందు
గగనం తలవంచి గతి మారి
నేల చేరదా
నెలతా
నీవు నింగితనానివే.

ప్రమదా పంచభూతాలు నీవే
విశ్వానికి మోక్షాన్నిచ్చే
పంచాక్షరి మంత్రం నీవే.

అపరంజి
ఆద్యశక్తివి నీవే
ఆదిశక్తి నీవే.

ఉగ్మలి
నీ ఉనికి కే ఉపద్రవం
వాటిల్లితే
తప్పదు ప్రళయం.

త్రిదర్శినీ
సృష్టి స్థితి లయల మూలబీజం నువ్వే.

ధవాలాక్షి
దేవాలయపు ధ్వజ స్తంభంలా
ప్రతిగృహపు మూల స్తంభం నువ్వే.

అంబురిహాక్షి
అందుకే అందుకో
అందరి మనో హారతి
మగువా నీకు
మా మంగళ(కవన) హారతి



– కళ తాటికొండ
9989891558

## మహిళా దేవోభవ...!

అమ్మవడినుంచి
రాలిన సజీవపూల
మాలికలం....
పుత్రులం,పుత్రికలం
మనుమలు,మనుమరాళ్ళం....
ఈ చరాచరజగత్తులో
ఆది దైవం అమ్మే!
ఆమె వల్లనే అతివల
సంబరం మహిళా సంరంబం!
నాన్నతో నవ్య ప్రేమ జనితం..
అన్నిరంగాల్లోఅతివలదే
పై చేయి
ఆటల్లో,పాటల్లో
ఆకాశంలోసంగకాదు
అంతరిక్షమంతా ఆమే
ఆమె వారసులైన పుత్రికలదే విజయం!
మహిళలను
మాతృమూర్తులుగా
భావించు!
అమ్మాయిలపై అఘాయిత్యాల
చేయకు
ఓ యువతా!
ప్రేమవలలలో
అమ్మాయిలను చంపకు!
"పరధనమట్టిలాంటిది
పరస్త్రీ తల్లిలాంటిది"
ఈ నిజం తెలుసుకో
నీకు అక్కచెల్లెలు లేరా!
ఈ మహిళాదినోత్సవం
కామాంధులకు కరుణ
మమత మానవత వెల్లివిరియని
మహిళాలోకం
మహోజ్వల దీప్తులై వెలగాలనీ!!!

–డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

## అగాధంలో ఆమె

అంగడి సరుకైంది ఆమె
వాంఛల రెక్కలు విప్పుకోగా..
సమాజం మీటుతోంది కన్ను
ఒళ్లంతా ముళ్ల చూపుల గాయాలు
బాలికల్ని సహితం వదలని మృగాళ్లు!

అమ్మను, అక్కను మరిచిన నరులు
మనసు నిండా మాలిన్య మురుగులు
అసమానతల విష వలయ వికృతాలు
అగ్గువైన అతివల శక్తియుక్తులు
నిస్సహాయ స్థితిలో అర్ధనారీశ్వరుడు!

మగాడి జన్మకు కారణ అమ్మ
పురుష కీర్తికి పునాది పడతి
ఇంటి ఆనందాల హరివిల్లు ఇల్లాలు
ఆయన సంరక్షణ గొడుగు నీడ ఆవిడ
ఆయన చెట్టయితే తల్లి వేరు అతివ!

ఆమె వంటింటి సెల్‌లో బంధీ
ఆమె ఆర్థిక స్వేచ్ఛకు సంకెళ్లు
భ్రూణ హత్యల ఘోర అరాచకాలు
ప్రకృతిలో సగమనే ఉత్తుత్తి మాటలు
అగాధంలో ఊపిరాడని అతివలు !

చదువుల తల్లులుగా సరస్వతులు
సంపదలు కూర్చే ఐశ్వర్యలక్ష్ములు
ధైర్యానికే ప్రతీకలు నవ దుర్గలు
సుఖసంతోషాల్ని దీవించే అష్టలక్ష్ములు
మహాశక్తి స్వరూపిణిగా పూజలు !



-మధుపాళీ
9949700037

## ఒంటరి నేను

విశ్వమంతా విను వీధుల్లో ఒంటరినై....
విహరిస్తున్నా....
నాకు నేను తోడుగా, నాకు నేనే నీడ గా....
ఊహకు అందని ఊపిరి తోడై,
ఓ మంచి శకుణంకై నిరీక్షిస్తూ,

నా ఒళ్ళంతా గాయాలమయమవుతున్నా....
సాగిపోతున్న నా లోపలి నాతో, నేను నడుచుకుంటూ...
చివరికి మిగిలిపోతానేమో ఒంటరి లా, .....
గడుపుతున్న రోజులు అనాధగా....

మిణుకు మిణుకు మంటూ గుండె చప్పుడు....
ఎప్పుడు పోతుందో తెలియని ప్రాణం....
చితిమీద కాలిపోయే శవం లా నిర్జీవమైన బతుకు....
చివరికి బూడిదయ్యే ఈ దేహానికి ఎన్ని ఆశలో...??!!

-దడిగె. నరేష్
(మస్కట్)
0096893029220

## నాగన్న పదాలు

సృష్టి ముందు అమ్మ
అమ్మ వెనుక బ్రహ్మ
బ్రహ్మ! గీచె బొమ్మ
ఓరి! నాగన్న.

అమ్మ మాటలు కరుకు
మనసు తీయని చెరుకు
బతుకు పోరున చురుకు
ఓరి! నాగన్న.

చైనాలో పుట్టింది
విశ్వాన్ని చుట్టింది
"కరోన" జన చితైంది
ఓరి! నాగన్న.



-నెమలికొండ నాగేశ్వర్ రావు
8688553470

## రైలు ప్రయాణం



సమ దూరం పాటించే
కలువని పట్టాల మీది ప్రయాణం!!

ఒక దాని వెనుక ఒకటి
క్రమశిక్షణతో కదిలే బోగీలు!

కచేరీలు ఎక్కని సంగీతం
తాళం తప్పని చిరుతల శబ్దం!

పావలా పల్లీలు
పదిరూపాయలకు అమ్మే
వ్యాపార నైపుణ్యం!

పసితనాన్ని పల్లెతనాన్ని గుర్తుచేసే
ఎప్పుడో తిన్న, ఎపుడూ తినాలనిపించే
నిమ్మపులుసు పిప్పరమెంటు!

టికెట్ తనిఖీ అధికారిని చూసి
బాతురూముల్లో దాక్కునే
టికెట్ లేని ప్రయాణికులు!!

ఉప్పు కారం పెట్టిన
మామిడి కాయ ముక్కలు
ఉపకారం చేస్తున్నట్లు
పక్కవారితో పంచుకోవడాలు!

శీతల పానీయాలు అమ్మేవాడు
వాడెనుకే వేడి వేడి మిర్చీ అంటూ
పొట్లం చుట్టి చేతిలో పెట్టేవాడు!

కిటికీనుండి చూస్తే
వెనక్కి పరుగెత్తుతున్నట్లు
పంటపొలాలు, పచ్చని చెట్లు!

దూరమెంతయిన
భారమనిపించని ప్రయాణం!
అద్దములో చూసుకుంటున్న
మన జీవన ప్రయాణం!!



-జగ్గయ్య.జి
9849525802

## పుస్తకాల పురుగులు ?!

కొవ్వొత్తి వెలుగు
పుస్తకం పై సూటిగా అలికినట్లే!
పుస్తకాల పై కాంతితో పాటు
పురుగుల సందడి !
అక్షరాల్లా చిన్ని చిన్ని దీపం పురుగులు
పఠనాసక్తియా !
చదివే వాళ్లు పుస్తకాల పురుగులు.

పాత పుస్తకాలు తిరగేస్తే పేజీల్లో
లైటు పురుగులు అతుక్కుని కనిపిస్తాయి!
పాపం రాత్రి పగలూ
చదువుతో జాగరణ పురుగులకు
పేజీకే అంకితం !
అక్షరాన్ని పట్టుకుని చదువుతున్నట్లే
పురుగులు గొప్పగా !

నీకు దీపం ఎంత ఇష్టమో
పురుగులకు అంతకన్నా ఇష్టం
నువ్వు పుస్తకం ముందేసుకుంటే
దీపం పురుగులు పుస్తకం పైనే !
ఇద్దరి అభిరుచి ఒకటే
జంటగా పఠనం
combined study

పురుగైనా పుస్తకంతోనే
మనిషైనా పుస్తకంతోనే
మనమైతే చదివి చదివి నిద్రపోతాం!
దీపం పురుగైతే
పుస్తకంలోనే ఉండిపోతుంది !!

మనం అక్షరాలను చదివితే
చిత్రం !
దీపం పురుగు
గొప్పగా వెలుగునే చదువుతుంది



-కందాళై
రాఘవాచార్య
87905
93638

## నా పాట సూడు

నాటుదనమనే స్వచ్ఛదనంతో
ఎలాంటి రంగులు అద్దుకోకుండా
సహజత్వాన్ని పులుముకొని గుబాళిస్తూ
మరింత శోభాయమానమై?
పల్లెలో కనిపించే
ఆహారం ఆహార్యం
చెట్టు పుట్ట జాతర
సంస్కృతి సంప్రదాయాలను
మేకప్ లేని అందాలతో
జానపదం ఝల్లుమంటూ
తట్టిలేపే ఆశయాలకు
ప్రాణంపోసే పదునైన పదాలతో
స్ఫూర్తిని నింపే చంద్రబోస్ కలం పదునై
సప్త స్వరాలతో కొత్త బాణీలు
రూపొందించే సుస్వరవాణి
మరకతమణి కీరవాణి
నాదఝంకారం రసభరితమై
యువగాయకులైన
రాహుల్ కాలభైరవల
మాస్ బీట్ కు హుషారైన గాత్రం
కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్
రూపొందించిన జోరైన స్టెప్పులను
అందిపుచ్చుకున్న తారక్ రామ్
తెరపై అదిరేలా డ్యాన్స్ సత్తాచాటుతూ
దర్శకధీరుడు రాజమౌళి సారథ్యంలో
మ్రోగించిన విజయఢంకా
విశ్వవేదికపై విజయాన్ని
సొంతం చేసుకుని....
నా పాట సూడు అంటూ
తెలుగు కీర్తి దరువై
ఆస్కార్ అవార్డు ఆభరణమై
భారతీయులందరికి గర్వకారణమై?

-మండవ సుధ
నిజామాబాద్

# కవిత్వానికి కొత్త దారి కున్వర్ నారాయణ్



"నేను ప్రకృతిని అనుసరించను.. నేనే ప్రకృతిని" నంటారు కున్వర్ నారాయణ్.

అంతేకాదు మనం రెండు ప్రపంచాల్లో బతుకుతాం..ఒకటి తాను సృష్టించిన ప్రపంచం.. మరోటి ఇతరులు సృష్టించింది..

నా ప్రపంచం మన ప్రపంచానికి భిన్నమయింది కావచ్చు కాకపోనూ వచ్చు.. అంటాడు

xxxxxxxxxxx

వర్తమాన హిందీ సాహిత్యాన్ని ముఖ్యంగా కవిత్వాన్ని గొప్పగా ప్రభావితం చేసారు కున్వర్ నారాయణ్.

హిందీ సాహిత్య ప్రపంచంలో తనదయిన సృజనాత్మక నైపుణ్యాన్ని



సాధించాడు. ఆయన సృజనాత్మక వ్యక్తీకరణలో సరళత, పదునయిన తాదాత్మ్యత కనిపిస్తాయి. మొత్తంగా సమతావాద దృక్పథం లో ఆయన రచనలన్నీ సాగాయి.

కున్వర్ నారాయణ్ రచనల్లో 'జీవితం..కవిత్వం తో రూపొందింది'అన్న BORGES మాటల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది.

కున్వర్ నారాయణ్ ఒక చోట ఇట్లా అంటాడు

'నేను జీవితాన్నుంచి
తప్పించుకోవాలనుకోవడం లేదు
అందులో భాగమవ్వాలనుకుంటున్నాను'...

హిందీ నవ్య కవిత్వోద్య మంతో మమేకమయిన కున్వర్ నారాయణ్ తన సరళమయిన భాష వ్యక్తీకరణలతో హిందీ సాహిత్యంలో ప్రత్యేక ముద్ర వేసాడు.

కున్వర్ నారాయణ్ దాదాపు ఆరు దశాబ్దాల పాటు సాహితీ రంగంలో వున్నారు.

ఆయన వివిధ సాహిత్య ప్రక్రియల్లో రాసారు. కవిత్వం, కథలు,ఎపిక్, విమర్శ, వ్యాసాలూ, అనువాదాలు చేసారు. వాటితో పాటు సినిమా, సంగీతం, కళలు, మ్యూజింగ్స్ కూడా రాసారు.

++++

19 సెప్టెంబర్ 1927న జన్మించిన కున్వర్ నారాయణ్ తన బాల్యాన్ని ఉత్తర ప్రదేశ్లోని అయోధ్య-ఫైజాబాద్ నగరాల్లో గడిపారు. ఆ కాలంలో ఆయన కుటుంబాన్ని టీబీ తీవ్రంగా కలిచివేసింది. అనేక మంది మృత్యువాత పడ్డారు. చివరికి తనకు అత్యంత ప్రియతములయిన తల్లి, సోదరి కూడా టీబీ వ్యాధికి బలయ్యారు.

అనంతరం కున్వర్ పెద్దన్నయ్యతో కలిసి లక్నో నగరానికి చేరుకున్నాడు. అప్పుడు దేశమంతా గాంధీగారి ప్రభావం పెల్లుబుకుతున్న సమయం. లక్నో లో వాళ్ళిల్లు అనేక మంది రాజకీయ నాయకులకు వేదిక గా వుండేది. ఆక్రమం లోనే కున్వర్ నారాయణ్ జీవితంలో తొలి రోజుల్ని, ఆలోచనల్ని ఆచార్య నరేంద్ర దేవ్, ఆచార్య కృపాలానీ తీవ్రంగా ప్రభావితంచేసారు. ఒక సంవత్సరం బాంబే లో నరేంద్ర దేవ్ తో వున్న కున్వర్ తర్వాత

ఆచార్య కృపలానీ తో 'విజిల్' పత్రికలో పని చేసాడు. ఆ అనుభవం తన ఆలోచననీ దృష్టి కోణాన్నీ విస్తారం చేసింది.

కున్వర్ నారాయణ్ లక్నో విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్ లో ఎం.ఎ. పూర్తి చేసారు. అప్పుడే 'లేఖ్ సంఘ్' అన్న సంస్త తో మమేకమయి పని చేసారు. తర్వాత విదేశాలకు వెళ్ళిన కున్వర్ కవిత్వం పైన పాబ్లో నెరుడా, నాజిమ్ హిక్మాట్ లాంటి అనేక విదేశీ సృజనకారుల ప్రభావం పడింది. పోలండ్, జెకోస్లోవేకియా, చైనా, రష్యా లాంటి దేశాల పర్యటన కున్వర్ ఆలోచనా పరిధిని విస్తృతం చేసాయి. 1956 లో విదేశాలనుంచి తిరిగి రాగానే కున్వర్ నారాయణ్ తొలి కవితా సంకలనం 'చక్రవ్యూహ్' వెలువడింది.



ఆ కాలంలోనే ఆయన 'యుగ చేతన' అన్న పత్రిక కు సహా సంపాదకుడిగా పని చేసారు. తర్వాతి కాలంలో 'నయా పత్రిక్', 'చాయానాత్' అన్న పత్రికలకు కూడా సహసంపాదక బాధ్యతల్ని నిర్వహించారు. ఎ పనిలో వున్నా ఎక్కడున్నా ఆయన తన రచనా వ్యాసంగాన్ని వదులుకోలేదు. తన సృజనని నిరంతరం నిలుపుకున్నారు. కవిత్వం తో పాటు అనేక కథల్ని రాసారు కున్వర్. తర్వాత వెలు వడింది 'తీస్రా సప్తక్'. ప్రసిద్ధ కవి అగ్నేయ సంపాదకత్వం లో వెలువడిన ఆ సంకలనం లో వున్న ఏడుగురు కవుల్లో కున్వర్ నారాయణ్ ఒకరు.



తర్వాత కున్వర్ కవితా సంకలనం 'పర్వేష్-హం తుమ్'

ఆ తర్వాత వచ్చిన "ఆత్మజాయి" ఉపనిషత్తులలో వున్న నచికేతుని పాత్ర ఆధారంగా రాసిన రచన అది. అందులో జీవితము,మరణమూ, సంఘర్షణ లని మూలనాతీసుకుని చేసిన ఈ రచన తాత్వికంగా వుంటుంది. అందులో తమ కుటుంబ సభుల మరణాలూ వాటి ప్రభావాలూ అంతర్లీనంగా కనిపిస్తాయి.

70 వ దశకం వచ్చేసరికి కున్వర్ నారాయణ్ పై సినిమా, సంగీతం, నాటకం, చిత్రకళా ప్రభావాలు అధికమయ్యాయి. ఆ కాలంలోనే 'నయా ప్రతీక్', 'చాయానాత్' పత్రికలకు సహా సంపాదకత్వం వహించాడు. కొన్ని సాహితీ సంస్థల నిర్వహణ బాధ్యతా స్వీకరించాడు. 71 లో ఆయన వెలువరించిన 'ఆమ్నే సామ్నే' అన్న కథల పుస్తకం ఆనాటి సామాజిక రాజకీయాల పైన సంధించిన వ్యంగ్యాత్మక రచన గా వినుతికెక్కింది

అయితే ఆయనకు గొప్ప పేరుని అనేక అవార్డుల్నీ ఇచ్చిన పుస్తకం 1979 లోవచ్చిన " కోయి దూస్రా నహీ'లో జీవితానుభవాల విస్తృతి కనిపిస్తుంది. 1999 కున్వర్ నారాయణ్ 'ఆజ్ అవుర్ ఆజ్ సే పహలే' అన్న సాహిత్య విమర్శ పుస్తకం వెలువరించారు. తర్వాత తన ఇంటర్వ్యూ ల తో కూడిన 'మేరె సాక్షాత్కర్' వచ్చింది. కున్వ నారాయణ్ అనేక సంవత్సరాల పాటు సినిమా, శాస్త్రీయ సంగీతాలను విశ్లేషిస్తూ విరివిగా రాసారు. పలు అనువాదాలు కూడా చేసారు.

2002లో ఆయన 'ఇన్ దినో' అన్న కవితా సంకలనం వెలువరించారు.

### సాహితీస్రవంతి



-వారాల ఆనంద్
9440501281

తర్వాత 'వాజస్రావాకే బహానే' అన్న ఒతిహాసిక గ్రంధం ప్రచురించారు.

హిందీ సాహిత్య ప్రపంచంలో విలక్షణ కవిగా పేరుగడించిన కున్వర్ నారాయణ్ సృజనాత్మక ప్రభావం మొత్తం హిందీ బెల్ట్ లో స్పష్టంగా కనిపిస్తుంది.

ఆయనకు సాహిత్యంలో అనేక జాతీయ అంతర్జాతీయ విశిష్ట అవార్డులు లభించాయి. అందులో కెనడా హాహిత్య అకాడెమి అవార్డు, జ్ఞానపీఠ్ పురస్కారం, కబీర్ సమ్మాన్, వ్యాస్ సమ్మాన్, లోహియ సమ్మాన్, సలభ్ సమ్మాన్, వార్సా విశ్వవిద్యాలయ గోల్డ్ మెడల్, ఇటలీ ప్రెమియో ఫెరోనియా లు కొన్ని మాత్రమే.

++++++

ఇట్లా హిందీ సాహితీ ప్రపంచంలో తనదయిన గొప్ప స్థానాన్ని పొందిన కున్వర్ నారాయణ్ ఎంపిక



చేసిన కవితల్ని ఆయన కుమారుడు అపూర్వ నారాయణ్ ఇంగ్లీష్ లోకి ప్రతిభావంతంగా అనువదించారు. మూల రచనని యధాతతదంగా కాకుండా, భావం చెడకుండా చాలా గొప్పగా ఇంగ్లీష్ లోకి అనువాదం చేసారు. అనువాదంలో అనేక మంది లాగా అకాడెమిక్ ఇంగ్లీష్ భాషను కాకుండా సృజనాత్మక ఆంగ్ల భాషను ఉపయోగించి ఈస్తెటిక్ ఫీల్ ని చివరంటా కొనసాగించారు. అది అనువాదకుని ప్రతిభకు నిదర్శనం. ఈ సంకలనంలో అనువాదకుడు అపూర్వ మూల కవిత్వాన్ని " EARLY MEDITATIONS, ROUGH ROADS OF HISTORY, JOURNEYS,THE RIVER DOES NOT GROW OLD, TREES, MITTORS AND SHADOWS, REMEMBERANCES, HUMAN ESQUE" విభాగాలుగా ఎంపిక చేసి కూర్చారు. చాలా గొప్ప కూర్పు.

1927లో జన్మించిన కున్వర్ నారాయణ్ తన 90 ఎల్ల వయసులో 15 నవంబర్ 2017 న పరమ పదించారు.

ఆయన కవిత్వం అందరూ ముఖ్యంగా కవులూ సాహిత్యకారులూ



తప్పకుండ చదవాలని నేను అభిలషిస్తున్నాను. ఈ సందర్భంగా కున్వర్ నారాయణ్ స్మృతికి నివాళులు అర్పించుకుంటూ, అనువాదాన్ని అందించిన అపూర్వ నారాయణ్ కి ధన్యవాదాలు

..... మీకోసం నేను చేసిన కున్వర్ నారాయణ్ కవిత్వ అనువాదాలు కొన్ని.....

### కొత్త మార్గం

నేను జీవితాన్నుంచి
తప్పించుకోవాలుకోవడం లేదు
అందులో భాగమవ్వాలనుకుంటున్నాను
జీవితపు ఊహాత్మక ఇరుసుపైన
కవిత్వానికి
అనుమానాస్పదంగా వున్న
స్థలాన్ని ఓ కుదుపు కుదపాలి.
అందుకు మొదట
జీవితపు శక్తి మూలాల్ని
క్రియాశీలం చేయాలి
తర్వాత ఆ శక్తిని
బతుకు కక్షకున్న ఇరుసుకు
జత చేయాలి
అప్పుడు
గతంలో లాగా
'యాంత్రికత' లేని
'మానవత్వం' వైపు మరలిన
కొత్త మార్గం ఆరంభమవుతుంది.

### ఓ వింతయిన రోజు

నేను రోజంతా గాయి గాయిగా తిరిగాను
ఎలాంటి ప్రమాదమూ సంభవించ లేదు
అనేకమంది మనుషుల్ని కలిసాను
ఎక్కడా అవమానం ఎదురుకాలేదు
నేను రోజంతా సత్యమే మాట్లాడాను
ఎవరూ తప్పుగా స్వీకరించలేదు
నేనివాళ అందరినీ విశ్వసించాను
ఎక్కడా మోసగింప బడలేదు
అద్భుతమయిన విషయమేమిటంటే
నేను ఇంటికి చేరుకోగానే
తిరిగొచ్చింది ఇంకెవరో కాదు
నేనే అని కనుగొన్నాను

### ఎనిమిదవ అంతస్తు పైన

నేను ఎనిమిదవ అంతస్తులోని
ఓ చిన్న ఫ్లాట్ లో
ఒంటరిగా నివసిస్తున్నాను
ఆ ఫ్లాట్ కు బయటకు తెరుచుకునే
రెండు కిటికీ లున్నాయి
అవి నన్ను తీవ్రంగా భయపెడతాయి
కిటికీలకు బందోబస్తుగా
గట్టి గ్రిల్స్ బిగించాను
బయటనుంచి ఏదో ఉపద్రవం
ముంచు కొస్తుందని కాదు
ఇంత ఎత్తులోకి చొచ్చుకొచ్చే
ధైర్యం ఎవడు మాత్రం చేస్తాడు
ప్రమాదమల్లా నా లోపలే వుంది
చుట్టూ ఈ ఒంటరితనం ఈ



విసుగూ
భయ భ్రాంతులని చేసే ఆ అంశాలు
ఏదో ఒక రోజు నన్ను
ఈ కిటికీల్లోంచి బయటకు దూకే
ఒత్తిడి చేస్తాయేమో

## నానీలు

అన్నం
వృధా చేస్తున్నావా
రైతు స్వేదం పారిస్తే
పండిన మెతుకులవి!

కుండపోత వాన
వరదపోటు
ఉన్నోడు కుపితుడు
పేదోడే బాధితుడు.

రాత్రి నన్ను
పలకరించిన అక్షరాలు
తెల్లారగానే
నేలరాలు



-ఎన్. లహరి
9885535506

## కవితా రచనలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రసన్న రామ్మూర్తి, డా॥ నీలిమ, జయసూర్య, కనకాచారి

కవితా రచనలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కె. ప్రసన్నరామ్మూర్తి అన్నారు. కామన్ డయాస్ ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కాన్ఫరెన్స్ హాలులో ఎం. బాల గంగాధరయ్య రచించిన జాషువా కవన జిగీష కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రసన్న రామ్మూర్తి మాట్లాడుతూ నవ, యువ కవులు మంచి రచనలు చేస్తున్నారని అన్నారు. పలువురికి ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షత వహించిన జర్నలిస్ట్ జయసూర్య, ప్రభుత్వ సహాయ కార్మిక అధికారి డా. నీలిమ కృష్ణమూర్తి, తెలంగాణ తల్లి రూపశిల్పి, బీవీఆర్ ఆచారి, కార్యక్రమ నిర్వాహకుడు, కవి తంగెళ్లపల్లి కనకాచారి, కవయిత్రి శైలజామిత్ర, శంకర స్వామి, కవి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రచయిత పూదత్తు కృష్ణమోహన్-మూర్తిమత్వ, భావనా సుధ

పుస్తక సమీక్ష

కవి, వ్యాస, పద్య, గేయ రచయిత పూదత్తు, కృష్ణమోహన్ వ్యక్తిత్వ వికాసంపై రచించిన "మూర్తిమత్వ సుధ", కవితా సంపుటి 'కథా భావనా వీచికలు' ప్రశంసనీయంగా రచయిత ప్రతిబను వ్యక్తీకరిస్తున్నాయి. 'మూర్తిమత్వ సుధ'లో మానసిక శాస్త్రానికి సంబంధించి బాల బాలికలు ప్రధానంగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని సాధించే సామాజిక ప్రయోజనాన్ని, రచయిత ఆకాంక్షించారు. మానసిక శాస్త్ర విద్యాధికునిగా రచయిత, సమాజంలో వ్యక్తులు ఉత్తమ పౌరులుగా, ఒత్తిడిని జయించడానికి 30 అంశాల ద్వారా జీవితాన్ని సంతోషం, ప్రయోజకత్వం ఎలా సాధించాలో సోదాహరణంగా వివరించారు. నేటి సమాజం ఎదుర్కొంటున్న హింస, దౌర్జన్యాలు, హత్యలు, ఆత్మహత్యలు వంటి దుస్థితి పారద్రోలడానికి, మానసిక శాస్త్రీయం ద్వారా ఉత్తమ మూర్తిమత్వ వికాసం సాధించడానికి, ఈ పుస్తకం కరదీపికగా, మార్గదర్శనం అందిస్తోంది. వేసవి సెలవుల సద్వినియోగం, పరీక్షలు బాగా రాయడం ఎలా, విజయం సాధించాలంటే, మనసు– నియంత్రణ యించుమించు ప్రతీ అంశం అర్థవంతంగా, సూటిగా ఆత్మవిశ్వాసం, శక్తి సామర్థ్యాలు అందరిలో పెంపొందింప చేసేటట్టుగా వున్నాయి. ప్రతీ వ్యాసంలో శ్లోకాలు, పద్యాలు, తాను రచించిన 'కృష్ణమో హన శతక పద్యాలను' భావాన్ని స్పష్టం చేస్తూ సాహితీ సప్రమాణంగా ఉటంకించటం విశేషాంశం. భారతీ య ఆధ్యాత్మిక, పురాణ శతక ఇతిహాస నైతిక



అత్యుత్తమ విలువల ద్వారా, ఆధునిక మానసిక శాస్త్ర అధ్యయనాన్ని జోడించిన సమాజ సత్తుల ప్రగతి లక్ష్య సాధనను రచయిత ఆకాంక్షించారు. 'గెలుపు బాట జగతి కృష్ణమాట' మకుటంతో అలతి అలతి పదాల ఆటవెలది వద్యాలు వ్యాసాల ప్రాధాన్యతను పెంపొందింపచేసి జ్ఞాన యుక్తమైన మానవతా విలువల చైతన్యదీప్తి ప్రసరిస్తున్నాయి. పూదత్తు కృష్ణమోహన్ అభినందనీయులు.

### 'కృష్ణభావనా వీచికలు' (కవితా సంపుటి)

కృష్ణమోహన్, తన హృదివీణ స్పందనగా కలం కదిలి, కవితా భావనా వర్షం కురిపించిన కవితా సంపుటిలో 88 కవితలను ఏర్చికూర్చి ప్రచురింపచేసారు. వివిధ వాట్సప్ సమూహాలలో, సాహితీ సమావేశాలలో, వేర్వేరు సందర్భాలలో కవి హృదయం ఆవిష్కరించబడిన కవితలు యివి. ఆకర్షణీయంగా రాధాకృష్ణ వర్ణచిత్రంతో ప్రచురింపబడిన ఈ సంపుటిలో సినారె, కాళోజీ, వివేకానంద, వాజ్‌పేయి వంటి మహనీయులకు స్మృతి, సమాజ పరిణామాలపై సంఘటనలపై స్పందించే ఆసిఫా ఆవేదన, మహిళా దినోత్సవం, నా బంగారుతల్లి, అవనిపై దేవుళ్ళు, ప్రేమ విలాపం వంటి మహిళా వేదనను ప్రతిబింబం పచేసే కవితలు సామాజిక హితాన్ని, ప్రయోజనాన్ని ఆశిస్తున్నాయి. టీవీ సీరియల్స్‌కు, రియాల్టీ షోలకు కళ్ళప్పగించే తల్లిదండ్రులు కళ్ళు తెరిచే కాలమెప్పుడో" అంటూ ప్రశ్నిస్తారు. 'పిల్లోడి ప్రశ్న'లో "నిత్యం పిల్లలనిందించే తల్లిదండ్రుల తెలివిని కొలిచే తక్కెడ ఎక్కడ?" అంటారు. "అమ్మ భాష కమ్మదనం మరచి, వెర్రి భాషలతో వెంపర్లాట లేల?" అంటూ మాతృభాషా వేదనలో ప్రశ్నిస్తారు. ఎండిపోతున్న వంటలను చూసన్నా, కుమిలిపోతున్న రైతుల వ్యధలు "కడుపులు నిండాలి"లో ప్రతిబింబం పచేస్తారు. 'అరక్షణంలో ఆత్మార్పణ చేసుకొని ఒకరు వెళ్ళిపోతే ఆత్మీయులు అందరున్నా ఒంటరివారే" అంటూ 'ఒకరు' కవితలో అయినవాళ్ళ జీవన వేదన వ్యక్తం చేస్తారు.

'అరక్షణంలో ఆత్మార్పణ చేసుకొని ఒకరు వెళ్ళిపోతే ఆత్మీయులు అందరున్నా ఒంటరివారే' అంటూ 'ఒకరు' కవితలో అయినవాళ్ళ జీవన వేదన వ్యక్తం చేస్తారు. తెలంగాణ ఉద్యమంలో సకల జనుల సమ్మె సమయంలో 'గుండె గుండెలో మంట రగలగా', ఉద్యమ వీరులకు వందనం అందిస్తారు. వైవిధ్యభరితమైన ఇతివృత్త కవితా స్పందనలతో 'కృష్ణ భావనా వీచికలు' సామాజిక జీవన గమనంలో ప్రతి కోణం స్పృశించి జీవిత పరమార్థం అభిలషిస్తోంది.



ప్రతులకు:
పూదత్తు కృష్ణమోహన్
ఇ.నెం.1-280/14డి,
రోడ్ నెం.3,
పద్మావతి కాలనీ
జడ్చర్ల–509 301
మహబూబ్‌నగర్ జిల్లా
(తెలంగాణ)



–జయసూర్య
సెల్:9014948336
9394775088

## ఆశావాదిని

చైత్రానికి కుసుమాంజలితో
ఆమని కోయిలలు గానం చేసే గొంతుకతో
కవికోయిలలు పరవశించి పలికిన పదాలతో
ఆశాభావాల్తో ఆహ్వానించాలనిపించింది ఉగాదిని,
నూతన జీవనానికి 'నాంది'ని.
ఘనకీర్తి గడించిన శుభకృతు శుభ
ఘటనల ఘడియ లెన్నివున్నా
శుభకృతుకు వెచ్చని వీడ్కోలు,
ఆశాకిరణావృత 'శోభ'కృతుకు ఆహ్వానం.
ఎన్ని ఋతువులున్నా వసంతం వేడుకేవేరు,
మనసులను రంజింపచేసే మధుమాసం.
వేయివృక్షాల ప్రాణవాయువు సహిత
వేపవృక్ష కుసుమ భక్షణం,
వగరు, తీపి, పులుపు రుచుల జీవన వైవిధ్యం.
గగుర్పొడిచే ఘటనల వార్తలను నెమరేస్కుంటే
పూత దశలోనే తెగులు దాడి ధాటికి గురౌవుతున్న ఫలరాజట.
సంప్రదాయం పేరిట హింసాత్మక వినోదాల నియంత్రణ కాంక్షిస్తున్నా
గాలిలో కలిసిపోయే సరదాల ప్రాణాలు.
'ఈ యువతకేమయిందో!' అనుకొని అచ్చెరువందించే
అత్యాచార, హత్యాచార, ఆత్మహత్యాచార, పరువుహత్యాచార,
సైకోల, సైబర్ నేరగాళ్ళ నేరాలాగాలని,
వ్యాపార దృక్పథ, హింసప్రధాన ఇతివృత్త కథా చిత్రాలకు
విరామ చిహ్నం పెట్టాలనీ,
నిర్భయ, దిశ, ఫోక్సో, షీటీమ్స్, ఉమెన్స్ సేఫ్టీ
యాపులతో మార్పులు కలగాలనీ,
కార్చిచ్చులా వ్యాపించి ప్రాణాలు హరించిన
మహమ్మారి మరుగైందనుకుంటే
మళ్ళీ మరో వైరస్ వచ్చీ!
శిరియా శిథిలాల క్రింద మార్మోగిన

మరణమృదంగ, మృత్యుహేల
మరల వినకూడదని, కనకూడదనీ,
ఆ మూడూ అటు వైపు, ఈ మూడు ఇటువైపేతే
యుద్ధం తథ్యమనే అంచనాలాందోళనలకు స్వస్తితో
వసుధైక కుటుంబ వాతావరణం విరాజిల్లాలనీ,
కుల, మత, వ్యక్తిగత, రాజకీయ వైషమ్యాలకన్నా
వ్యవస్థ మేలుకోసం పాలకులు పనిచేయాలని
శాస్త్ర విజ్ఞాన రంగాలలో
శ్లాఘనీయ విజయాల సమోదులతో
శోభకృత్ శోభాయమాన ఉగాదిగా శోభిల్లాలని
ఆశాజనక పంచాంగ శ్రవణాన్ని ఆశించే ఆశావాదిని.



-వేదం సూర్యప్రకాశం
9866142006

## పంచమ స్వరంతో!...

విరించి సృష్టికి ఆద్యత నొసంగిన రోజు!
నక్షత్రాగమనానికి నాందీ పలికిన రోజు!
ప్రకృతి పురుషుణ్ణి కొలిచేరోజు!
హరి సోమకుని సంహరించి
వేదాలను పరి రక్షించిన రోజు!
ప్రకృతి పచ్చదనంతో!
సుమ సౌరభాలతో!
లే మావి చివుళ్ళతో!
వేపూత సోయగాలతో!
వెన్నెల జల్లులతో!
మల్లెల గుబాళింపు తో!
కొత్త చిగుళ్ల వసంతాన్ని!
భరత జాతి అంతా!
విభిన్న రీతుల్లో!
పుత్తాండుగా! బైసాఖిగా! నౌరోజ్ గా!విషుగా!



గుడి పదవాగా!'ఉగాదిగా!
విభిన్న రీతుల్లో పిలుస్తూ!
భారతీయతకు అద్దం పట్టిన వేళ!
జాతీయతను చాటుకున్న వేళ!
ఇల్లిల్లూ మామిడితో రణాలతో!
ముస్తాబౌతున్న వేళ!
చేదు,వగరు,పులుపు,ఉప్పూ,కారం,తీపి లతో!
కలిసిన షడ్రుచుల సమ్మేళనాన్ని!
విందారగించగ నను రా! రమ్మంటుంటే!
మానవతను చాటుతూ!
మహిలో మీరంతా!
ముదంతో మానవులుగా జీవిస్తూ!
మాధవీయతను చాటండని!
నా మది కోయిల ఈ ఆమని వేళ!
తన సందేశాన్ని ఈ పంచాంగ శ్రవణంగా!
ఈ శుభకృత్ నామ ఉగాది!
గీతాలాపన గావిస్తోంది
తన పంచమ స్వరంతో!



-ఎస్.ఎన్.మూర్తి. దోసపాటి.
9866631877

## శ్రీ శోభ కృత్ నామ ఉగాదికి స్వాగతం

శ్రీ శుభకృత్ నామ ఉగాదీ నీకిదేమావీడ్కోలు..
నువ్వు మంచి,చెడులు కలగలిపిచూపించావు,
కరోనా వైరస్ లను ప్రవేశపెట్టి ప్రపంచాన్ని
అతలాకుతలంచేసి
ఎనలేని ప్రాణాలను బలిగొన్నావు,
మిన్నంటే నిత్యవసరాలధరలను తగ్గించకనే
తుర్రుమన్నావు,
యువత నిరుద్యోగ సమస్యను
పరిష్కరించకనే పరుగులు తీసావు,
మహిళలపైజరుగుతున్నఅత్యాచారాలను
రూపుమాపకనే వెడలిపోయావు, అన్నికోణాల్లో నీ
నిర్లక్ష్యవైఖర్ని చూపి
ముఖంచాటేసిన తరుణంలో...
శ్రీ శోభకృత్ నామ ఉగాది తనదైన శైలిలో
చేసింది రంగప్రవేశం ,
శ్రీ శోభకృత్ వత్సరమా...
నీకు స్వాగతం పలుకుతోంది మానవాళి,
సమాజంలో.... నువ్వుచక్కదిద్దాల్సినరాచకార్యాలు ఎనలేనివి,
మనుషుల మధ్య నానాటికిఅణగారిపోతున్న
మానవత్వపు విలువలను పెంపొందించు,
అవినీతిని కూకటివేళ్ళతో పెకిలించు,
సగటుమనిషి జీవితాన్ని చక్కదిద్దు,
యువతనిరుద్యోగసమస్యను
పరిష్కరించిచేయూతనందించు,
ప్రపంచవ్యాప్తంగామహిళలపై
జరుగుతున్నఅత్యాచారాలనురూపుమాపి
అతివలఆవేదనను అంతమొందించు,
గుండె పగిలిన రైతన్నలకు
చేయూతనందిస్తావన్నఆశతో
మానవాళి నీకుపలుకుతోంది
స్వాగతం..సుస్వాగతం"



-రాయవరపు సరస్వతి
9885656356

## ఆవలి ఒడ్డు

వసంత కాలపు పుడమి గర్భాన వికసించిన
చిగురులను పూలను చూశాను
యవ్వన గీష్మాన కష్టాల కడలి ఇసుక తీరాల
ఎండమావులను చూశాను.

శ్రావణ మేఘాల చాటున కౌమారపు
తలపుల వలపు చిరుజల్లులతో
తడిసి పోయాను
కార్తీక మాసపు కోవెల గంటల ఘణ ఘణల మది
మురియగా
శరదృతువు పండువెన్నెల బొండు మల్లెల
పరిమళాల
తొలి కౌగిళ్లను చవి చూశాను.

హేమంత గాలుల పుష్య మాసపు
మంచు తెరల వయసు మడత పొరల
జీవిత దుప్పటిలో ఒదిగిపోయాను.

అవిగో వచ్చేసాయి
నా మలి జీవన సాఫల్య ఫలితాలు
అన్ని ఋతువులు సెలవు తీసుకున్నాయి
ఒక్క శిశిరం నా వెంటననీటి ఉంది.
అడవిలోని నదీ ప్రవాహంలో
తెరచాపలేని నావ ఊగిసలాడుతుంది
అలలు వయసు మీరి నిట్టూర్పుతున్నాయి
గాలితో అనుభవాల మనసు
పిచ్చిగా ఈలలు వేస్తుంది
అక్కడ వ్యర్థమైన వాడిన పూలు నేలంతా పడి
మలి సంధ్య సిందూరాలను తలపిస్తున్నాయి.

క్రీనీడలలో పండుటాకులు రాలి
గాలికి అటు ఇటు కొట్టుకుంటున్నాయి
ఆవలి ఒడ్డు నుండి
ఆవల తీరం నుండి
ఈ మలయ మారుతంలో
నాకోసం ఏవో వేడికోళ్లు
ఏవేవో సుస్వరాల వీడికోళ్లు
నన్ను రమ్మంటున్నాయి
మీకు వినిపించడం లేదా!?



-రాఘవ మాస్టారు
9741407099

## కొత్త మురిపెం

నూతనంగా సమాజంలో కి
అడుగిడిన శుభాలనొసగే
శ్రీ శోభకృత్ నామ వత్సరం
ప్రకృతి నవ్య శోభలతో
వయ్యారంగానడిచివచ్చింది.

తెలుగు దనంతో ఉట్టిపడిన
సంస్కృతి, సంప్రదాయాల
సందడితో తెలుగుదనం
వచ్చింది,
సమాజంలో పేరుకుపోయిన
సమస్యలవలయాన్నిఛేదించగ వచ్చింది,
మధుమాసంమధురగానంతో
కోయిలమ్మ వచ్చింది.

డిగ్రీలు చేత బట్టిన యువత
జీవనభృతికోసంశుభాలనొసగే
శ్రీ శోభకృత్ వత్సరం
యువత భవితను తీర్చదిద్ద
నుందని భావిద్దాం.

కొత్తమురిపెంతోనూతనవధువులా
వచ్చినకోయిలమ్మనునుసిగ్గులు వలకబోస్తూ
మది ఊయలలూగి....
కు..హూ..కు..హూ మని
తీయనిగొంతుతోగానంచేసింది"



-రాయవరపు సరస్వతి
7989665525

## సిచ్చు

తల్లిదండ్రి రెక్కల కింద
పేమగ పెరిగిన బాల్యం ఇడిసి
పట్నం బాట వట్టినప్పుడు
మనసంతా కోడి సెలిగిన పెంటైంది.

పరిస్థితులు ఒటోటి
చర్నకోలై ఝుడుస్తుంటే
జంగవిల్లి వెంటవడిన కోడిపిల్లోలె..
ఏ గలుమల నుండి ఏ గలుమలంగ
వురుకుతున్నో తెలువకుంది.

ముందుకూ వెనక్కి
వెనకకూ ముందుకి
బదుకు బారకట్ట పందెవై
పానవంతా ఆగవాగవవుతుంది.

ఆరేడేండ్ల సంది పట్నంల
బుక్ బుక్ అంటూ భుక్తి కోసం
హాస్టర్ల పొంటి తినుకుంట
పొద్దనక, మాపనక
కండ్ల మొగ్గలిప్పి పొత్తకాలు తిప్పుతుంటే...
ఊళ్లే అమ్మనాయన
కొడుకు కొలువు జేర్తదని
ఆశల దీపంతై ఎలుగుతుండ్రు.

కాని ఇయ్యాల...
పరీచ్చలు వెట్టే బోర్డు
అవుకతవుకల అంగడైంది
కోర్టులో శిఖాయత్తుకెక్కుతూ, రద్దు జేస్తూ...
భవితను తాకట్టువెడుతూ...
వాయిదాల వడ్డన జేస్తుంది.



ఎవల్లిచ్చిన అధికారమో...?
గద్దోలె కోడివిల్లను
తన్నుకు వోయినట్లు
కలల్ని తన్నుకువోతుంటే...
కొలువు వత్తదో రాదోనని
అద్దమ రాత్రి ఉలిక్కిపడుతూ ...
పానం తినే పరిస్థితి ఎదురైనట్లు
టిక్కటివ్వ పిట్టోలె ...
రెక్కల్ని బాదుకుంటున్న.

ఇది ఎవల్లు వెట్టిన సిచ్చో ...?
తెలువదు గాని
పైనింద ముండ్లైతె మొలుస్తున్నై
కండ్లల్లో నీటి బుగ్గలు పగులుతున్నై
గుబులు గుర్రవెక్కినట్లు
గుండె ఒక్కటే వురుకుడు పట్టు వట్టింది.



-బింగి శ్రీకాంత్
7893613015

## వసంత గీతాన్ని పాడుతూ...

మోడువారిన ఆకులపై
కొత్త చిగుర్లు పూయిస్తు
వాడి పోయిన మనసులో
నూతన మొలకలు
మొలిపిస్తూ మైమరపిస్తూ
మళ్ళీ వచ్చింది ఉగాది
ముగబోయిన గొంతుని
సవిరించుకున్న కోకిలమ్మ
కొత్త రాగాలను కూర్చుని
నేర్చుకుని పేర్చుకుని
వసంతగీతాన్ని పాడుతూ
మళ్ళీ వచ్చింది ఉగాది
ఆరు రుచుల సంగమంలో
ఆరోగ్య నిధులను
పోగేసి కలగలిపి
సమస్త మానవాళికి
యావత్ తెలుగు జాతికి
ఆశగా అందివ్వాలనే
తపనతో పరవశంతో
మళ్ళీ వచ్చింది ఉగాది
కాలుష్య కాసారాన్ని
తగించేందుకు పచ్చదనాన్ని
పెంపొందించమని
ప్రకృతిని వనాలను
వనరులను సంరక్షించమని
మానవాళికి సూచిస్తూ
మళ్ళీ వచ్చింది ఉగాది



-శ్రిష్టి శేషగిరి
9290652632

## శ్రీ శోభకృత్ ఉగాది

చెట్లు ఆకులు రాల్చి
ఆశల చిగుళ్ళు వేసాయి!
పువ్వుల పూతలు
కాయలమోతా తోడైంది!
అంటే ఉగాది పండగ వచ్చింది!
రాగం తానం పల్లవితో తోటల
కోకిలమ్మలు కుహూ కూసాయి!
ఎండ వేడిమి తోడైందంటే
సంకేతంగా ఉగాది పండగ వస్తుంది!
గుమ్మాలకు పచ్చ తోరణాలు కట్టాము
వాకిట రంగురంగవల్లులు వేసాము
ఆరు రుచులా ఆరారు రుచులా
మామిడి కాయ వేప పువ్వులా
పల్లచింత కొత్తబెల్లం అరటిపండుతో
ఉగాది పచ్చడి ఎంచక్కా చేసాము
కొత్త కొత్త ఆశలు చిగురించే
వరాలిమ్మని దేముని కోరాము!!
గుడిలో గంటల మేళం మోగింది
పంచాంగ శ్రవణం ఇంపుగ సాగింది
రాజపూజ్య అవమానాలు మన నడకలేగా
కష్టించక ధనం దానికదే వస్తుందా
ఉగాది పచ్చడి రుచి చూస్తే తెలిసేనా
రాబోయే కాలం పోకడ ఎరుగుదుమా
పాతొక గతమూ అనుభవమూ
కొంగ్రొత్త వింత వింతల సమాగమము
శ్రీ శోభకృత్ నామ వత్సరమా! రావమ్మ!
స్వాగతము!! సుస్వాగతమ్ము నీకు!!
మా బాలలందరికీ నవ శోభలివ్వమ్మా!!





- యల్. రాజా గణేష్,
సెల్: 9247483700

# తెలుగువారి తొలిపండుగ



పచ్చని తోరణాలు, పసుపు కుంకుమలతో అలంకరించిన గడపలు, ముత్యాల ముగ్గులతో ముంగిళ్ళు, కమ్మని వంటల ఘుమఘుమలతో లోగిళ్ళు, పంచాంగ శ్రవణపు మంగళా శాసనములు? ఇవన్నీ తెలుగువారి ప్రతి ఇంటా కనిపించే పండగ సంబరాలు? అదే ఉగాది.

'శోభకృతు'లను వల్లే వేసుకుంటూ, 'శుభకృత్'ను స్వాగతిస్తూ, శోభాయమానంగా తెలుగువారు ఉగాది వేడుకలు జరుపుకుంటున్న శుభ తరుణం.

ఉగాది హిందువులు అత్యంత ఇష్టంగా జరుపుకునే తొలి పండగ. ఉగాదితోనే తెలుగువారి పండగలు ప్రారంభమవుతాయని బలంగా విశ్వసిస్తారు. వసంత మాసంలో వచ్చే ఈ పండగకు ప్రకృతికి ఎంతో అవినాభావ సంబంధం ఉంటుంది. భారతీయ సాంప్రదాయం ప్రకారం చైత్ర శుక్ల పాడ్యమినాడే అంటే, ఉగాది రోజున సృష్టి జరిగిందని పురాణాలలో చెప్పారు. ఈ రోజునే బ్రహ్మ సృష్టిని, సృష్టించాడని అందరూ నమ్ముతారు. బ్రహ్మకల్పం 'ప్రభవ'నామ ఉగాదితో మొదలై నేటికీ కొనసాగుతుంది. మత్స్యావతారాన్ని ధరించిన శ్రీమహావిష్ణువు సోమకుడిని సంహరించి వేదాలను రక్షించి బ్రహ్మకు అప్పగించిన రోజు కూడా ఇదే అని చెబుతారు. శ్రీరాముడు, విక్రమాదిత్యుడు, శాలివాహనుడు పట్టాభిశక్తుడైన రోజు కూడా ఉగాదినాడేనని తెలిపారు. ఉగాదినాడు వరాహమిహిరుడు పంచాంగాన్ని జాతికి అంకితం చేశారు. దక్ష ప్రజాపతి కుమార్తె అయిన దాక్షాయిని మరికొంతమంది దక్షప్రజాపతి కుమార్తెలకు 60 పేర్లు ఉన్నాయని, ఆ పేర్లు 60 పేర్లు తెలుగు సంవత్సరాల పేర్లుగా వచ్చాయని ప్రచారంలో ఉంది. మరో కథలా కృష్ణుడికి ఉన్న భార్యలలో సందీపని అనే రాజకుమారికి 60 మంది సంతానానికి మారుగా ఈ పేర్లు వచ్చాయని తెలిపారు. ఇన్ని కథనాలతో ఉగాది పండగ తెలుగువారి తొలి పండగ అయింది.

తెలుగుదనం ఉట్టిపడేలా జరుపుకునే ఈ పండుగకు వివిధ ప్రాంతాలలో ఒక్కొక్క పేరుతో జరుపుకుంటారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలో 'ఉగాది' అని, మహారాష్ట్రలో 'గుడి పడవ', కేరళలో 'విషు'; తమిళనాడులో 'పుత్తాండు'; సిక్కులు 'వైశాఖి' బెంగాలీలు 'పోయిలా బైశాక్' పేరుతో ఉగాది పండగను జరుపుకుంటారు. ఇక ఉగాది అంటే మొదలు అని అర్థం. అనగా ఈ సృష్టి ప్రపంచ నక్షత్ర గమనం మొదలైనటువంటి మొదటి రోజు. ఉగాది యుగానికి ఆది 'యుగాది'గా ఆరంభమై,' ఉగాది'గా వ్యవహరిస్తున్నారని వ్యవహర్తలు తెలిపారు. జనవరి ఒకటవ తేదీన పాశ్చాత్యులు కొత్త సంవత్సరంగా భావిస్తే, తెలుగు వారు మాత్రం ఉగాది రోజునే కొత్త సంవత్సరం ఆరంభంగా పరిగణిస్తారు.

ఉగాది అనగానే షడ్రుచులతో కూడిన పచ్చడి, పంచాంగ శ్రవణం గుర్తుకు వస్తాయి. వేప పువ్వులు, మామిడికాయలు, బెల్లం, కొబ్బరి,అరటి పళ్ళు, ఉప్పు, కారం ఇలా ఆరు రుచులు తెలిసేలా షడ్రుతుల సంఘంగా ఉగాది పచ్చడిని తయారు చేస్తారు. తీపి- ఆనందానికి, ఉప్పు- జీవితంలో ఉత్సాహము, రుచికి సంకేతం, చేదు- బాధ కలిగించే అనుభవాలు, పులుపు- నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులు, వగరు- కొత్త సవాళ్లు ఇలా జీవితంలో జరిగే భావానికి అనుభవానికి ప్రతీక.

చైతన్య నవరాత్రులు ఉగాది పండగ నుండే ప్రారంభమవుతాయి. రైతులు కొత్త పంటలు వేసి, కొత్త జీవితానికి నాందిగా జరుపుకుంటారు. తెలుగువారి లోగిళ్ళు పంచాంగ శ్రవణం ఘనంగా నిర్వహిస్తూ, కొత్త సంవత్సరంలో తమ రాశి ఫలాలసమాచారాన్ని తెలుసుకొని ముందుకు సాగుతారు. ఈ పండుగ రోజున కొత్త పనులు ప్రారంభించుట అన్ని విధాల మంచి జరుగుతుందని నమ్ముతారు.

గత రెండు సంవత్సరాలుగా కరోనా మహమ్మారితో ఇంటికే పరిమితమైన ఉగాది పండగ, టెలివిజన్లోనే పంచాంగ శ్రవణం విన్నాము. నేడు పండగను పదిమందితో కలిసి చేసుకుని, దేవాలయ సందర్శనాలు, కవి సమ్మేళనాలు, రాశి ఫలితాలు వింటూ, అమ్మ చేతి కమ్మనైన వంటలు తింటూ, ఆరు రుచుల పచ్చడి సేవిస్తూ, ఆనందంగా జరుపుకుందాము.

ఇంతటి విశిష్టత కలిగిన ఈ 'శోభకృత్'ఉగాదిని తెలుగువారమంతా ఆనందంతో సకల సౌభాగ్యాలను ఒనగూర్చి, ప్రతి ఇల్లు శోభాయ మానంగా వెలుగొందాలని కోరుకుందాం.

**తీపి- ఆనందానికి, ఉప్పు- జీవితంలో ఉత్సాహము, రుచికి సంకేతం, చేదు- బాధ కలిగించే అనుభవాలు, పులుపు- నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులు, వగరు- కొత్త సవాళ్లు ఇలా జీవితంలో జరిగే భావానికి అనుభవానికి ప్రతీక.**





-డా.శ్రీభాష్యం అనూరాధ
8790325502

## దీపం

అనారోగ్యపు జడివానలో చివుకుతున్న బ్రతుకులకి
అనుకోకుండా సంజీవినీ ముక్క దొరికినట్లు..

బాధల నెర్రెలు బారిన గుండె నేలపై
మోదపు తొలకరి చినుకులు రాలినట్లు..

చెదిరి నేల రాలనున్న ఆశల గూడుకు
అదనపు ఆధారమేదో అమరినట్లు

నిరాశా చీకట్లు అమావాస రాత్రిలో
చిరువెన్నెల ఆశల కిరణాలు ప్రసరించినట్లు..

యుద్ధ శతఘ్నుల మోతతో భీతిల్లిన హృదయాలను
శుద్ధ సంగీత ఝురుల గలగలలు శాంతింపజేసినట్లు..

భయమే బ్రతుకై పదునైన కత్తి అంచుపై నడుస్తున్నప్పుడు
మాయేదో జరిగి పూలపక్క కాళ్ళక్రింద పరుచుకున్నట్లు..

అశాంతి బెట్టకి వాడిపోయిన జీవన తరువు
ప్రశాంతి నీరందగానే ఆశల చివుళ్ళు వేసినట్లు..

బెదరగొట్టే కరాళ మృత్యువు కళ్ళెదుట నిలవగా
ఆది దేవుడు ప్రత్యక్షమై ఆదుకున్నట్లు..

గత కొన్నేళ్ళ అవిస్మృత ఆందోళనా వెల్లువని
అంతం చేసి, సమృద్ధి రహదారుల్ని పరిచిన

'శుభకృత్' శుభాలను శోభాయమానం జేయనెంచి
అభయమిచ్చు కోటి కాంతుల దీపమై
అరుదెంచింది "శోభకృత్" నవ వత్సరం!



-ఎస్. కాశింబి
సెల్: 9052216044

## వెనుదిరిగిన చూపు

మార్పు
కేవలం ప్రథమాక్షరానికి
ఉత్వం బదులు ఓత్వం చేరింది
శుభకృత్ శోభకృత్ అయింది.

నిన్నటి శార్వరి
ప్రపంచాన్ని గడగడలాడించిన
క్రిమి తిమిరాలు తొలగినా
నేటి శుభకృత్
వెండితెరను పండించిన
పలు పండుటాకుల్ని రాల్చింది.

అదే శిశిర దరహాసమై
రుధిర రణ రౌద్రపు నాటు తెలుగు పాటను
అనిదంపూర్వంగా
పశ్చిమాకాశంలో వెలుగు సంతకం
చేయించింది.

కాలాన్ని యుద్ధంతో గోడకుకొట్టటమే
ఆనవాయితీ
ఒకడి విజయం మరొకడి పరాజయం
ఒకడి ధర్మం మరొకడికి అధర్మం.

విలువలెప్పుడూ చీకట్లో మినుకు మినుకు
మనే తారలే

వాస్తవాలెప్పుడూ భగ భగ మండే పగళ్లే
సృష్టిలో పసిడి వెన్నెల నెలకొక్కసారే
ఆమని వత్సరానికి ఒక్కసారే
మనిషి జీవితం ఋతువులకతీతం కాదు
సృష్టి క్రమానికి విపరీతం కాదు
పరికించి చూస్తే
తూర్పు వెలుగైతే పడమట చీకటి
వెలుగు అటు మరలితే ఇటు చీకటి
నీవెంత చదరంగం ఆడే నేర్పరి వైనా
నిన్నోడించే వాడు పుడతాడు .

అందుకే
తీపి తిని తియ్యగా మాట్లాడ వలసి
వస్తుందని
కోయిల వగరుచిగురే తింటుంది
మావి కొమ్మలెక్కి మనిషిని హెచ్చరిస్తూనే
ఉంటుంది
మనిషికే ఇంకా కోయిల భాష తెలియడం
లేదు
మనిషి భాషే తెలియని వాడికి
పరభృతం భాష ఎలా తెలుస్తుంది
ప్రకృతి స్వరం ఎలా వినిపిస్తుంది

-వాధూలస
9701522234

## ఉగాది వారసులు

అవునన్నా... కాదన్నా, తెలుగు అక్షరాల సాక్షిగా
అప్పటికీ, ఇప్పటికీ...మరి ఎప్పటికీ
ఉగాదికి వారసులు... చరిత్రలో కవులు మాత్రమే.

ఆ వారసత్వంలో ఆస్తుల పంపకాలు లేవు...
అంతస్తుల తగాదాలు అసలే లేవు
ఉన్నది ఒక్కటే లక్ష్యం...ప్రతి తెలుగువాడి నుదుట
విభూతిరేఖల్లా తెలుగుదనం వికసించాలని....
తెలుగుభాష వైభవాలు....
ధ్వజస్తంభాల్లా ఊరూర దర్శనమివ్వాలని.

నిత్యం శాంతికపోతాల రెక్కల ఈకల్లో
విశ్వశాంతి గేయానికి స్వరకల్పన చేస్తున్న కవులంతా
గాయపడ్డ హృదయాలకు ఓదార్పు ఔషధాలవుతున్నారు
దిగంతాలను సైతం ధిక్కరించే ధనుంజయుడి బాణాల్లా
అక్షరాలను కవితల్లో సంధించిన ప్రతిసారి...
విశ్వశ్రేయస్సుకోసం నేను సైతం ఆహుతి అవుతానంటూ...
హోమీపత్రాలమీద పోటీపడి
కవులు సంతకాలు పెడుతున్నారు.

అల్లూరిలోని వీరత్వాన్ని
కలం సిరాగా మార్చుకున్న సందర్భాలలో
పౌరుషాల హారతికి తామే ఒక వెలుగై నిలబడుతున్నారు
ఆకలేస్తే కవితలతో కడుపునింపుకునే కవులు
ఖాళీ అవుతున్న మానవత్వ మందిరాలలో
తిరిగి అభిషేకాల పూజలకోసం సమాయత్తమవుతున్నారు.

చెప్పాలంటే వేపపువ్వులోని తెల్లదనానికి
తమ చిరునవ్వుల పుప్పడితో కవులు నగిషీలు చెక్కుతున్నారు
ఉగాది పచ్చడిలోని షడ్రుచులకు షామియానాలు వేస్తూ...
పంచాంగంలోని అంగంగానికి అర్థాలు చెప్తున్నది వాళ్లే
రాహుకాలాలకు లక్ష్మణరేఖలు గీస్తూ...
శుభగడియలకు నిత్యం తలుపులు తీస్తున్నది

కవులు మాత్రమే
మనిషికి శ్వాస ఆగితే...దాన్ని మరణమంటారు
అసలు కాలానికి,
శ్వాసను అంగవస్త్రంగా తొడిగిన తల్లులు వారే
తెల్లారితే చాలు దినచర్యగా
సూర్యుడు సైతం కవులకు నమస్కారం.

తెల్లకాగితం మీద కవిత్వాన్ని రాయటమంటే
సముద్రం మీద తీరాన్ని చేర్చే
నావను మనిషికి అందించటమే
కవి అంటే, కేవలం ఓ వ్యక్తి కాదు,
నిత్యం మండే ఓ నిప్పుకణం
కవిత్వమంటే కేవలం అక్షరాల వరుసలు కాదు
కవాతు చేస్తున్న లక్ష సైనికుల వోంట్లో
మరుగుతున్న ఓ రక్త సమూహం.

గంగాజలాన్ని తీసుకొచ్చి అందులోకి తొంగి చూస్తే..
కనిపించేవన్నీ సాక్షాత్తు కవుల సంతకాలే...
నదీ పుష్కరాలు, కవి సమ్మేళనాలు రెండూ ఒక్కటే
నదుల్లో మునిగి తేలితే పాప ప్రక్షాళన...
అదే కవిత్వంతో తడిచి ముద్దయితే...
బ్రతుకంతా సంస్కారపు సువాసన

అందుకే నేనంటాను ప్రతి ఏడాది, ఉగాదికి పేరు మారినా
వారసత్వ పత్రాలమీద మారని పేరు మాత్రం
అప్పటికీ, ఇప్పటికీ,
మరి ఎప్పటికీ ఒక్క కవులది మాత్రమే



-డా॥ కె.జి. వేణు,
8480 70084

## స్వాగతం నీకు ఉగాది

చైత్ర శుద్ధ పాడ్యమిన
నీ ఆగమనం..
ప్రతిఇంటఉగాది పర్వదినం..
వెల్లి విరియాలి మా అందరి
ఇంట సంతోషం!
ఆకులురాలేవేసవికాలం,
వసంతుని ఆగమనం,
పలుకుతున్నాం ఆహ్వానం.
స్వాగత తోరణాలతో
పలుకుతున్నాం స్వాగతం.
సస్య శ్యామలమయ దేశ రాష్ట్ర
అభివృద్ధిని కాంక్షిస్తూ నీకు స్వాగతం..
ఈ శోభకృత్ నామవత్సరమంతా
శుభములు
నొసగాలనిఆకాంక్షతో స్వాగతం.
వెచ్చనివేసవిలోవచ్చే
కమ్మని ఉగాదికి స్వాగతం.,
ఆనందంపంచసంతోషంపెంచ
తెలుపుతున్నాం నీకు సుస్వాగతం!



-ఎన్.. రాజేష్
9849335757

## ఉగాది శుభోధయం

ఈనాటి ఉషోదయం!
ఉగాది శుభోదయం!!
ఇది ఏ ఉగాదికైనా ఆది..!!

ఈ సూర్యోదయం అతి సుందరంగా..
మనోహరంగా ఉంది..

ఆదిత్యుని రథానికి దారిస్తూ..
నీలి మేఘాలు పక్కకు తప్పుకుంటున్నాయి..
తె లి మబ్బు తునకలు మాత్రం
ఆకాశం నిండా పూలు పరచినట్లుగా..
స్వాగతం పలుకుతున్నాయి...

నూతనో త్సాహంతో అనూ రుడు
అశ్వాలను అదిలిస్తున్నాడు..
తన కాలం వచ్చిందనేమో
దినకరుడు యవ్వనంతో
మిడిసిపడుతున్నాడు..

కోయిలమ్మ కొత్త రాగాలు
నేర్చుకుంటుంది..
మయూరి తన నడకలు
మార్చుకుంటుంది..

ప్రకృతి నూతనత్వానికి గుర్తుగా..
వేప"పువ్వు"
మామిడి"కాయ"
చింత"పండు"
కొత్త బెల్లంతో కలిసి
ఉగాది పచ్చడి కి
సిద్ధమవుతున్నాయి..!

గత సంవత్సరాల
కష్టాల కడలికి
"శుభ కృత్"శుభం పలికింది...
ప్రకృతిని శోభాయమానం చేయడానికి
"శోభాకృతు"వచ్చేసింది..!

నూతన సంవత్సరమా నీకు
స్వాగతం! సుస్వాగతం!!
సర్వేజనా సుఖినోభవంతు,.!
సమతా మమతా మానవతలే
మన అందరి వంతు..!!



- వి. మంగతాయారు
సెల్: 9949278483

## శోభకృత్ శుభలు

ప్రకృతి పాడే పరవశ గీతిక
ఉరకలెత్తించే ఉగాది వేడుక
ఇంటింటా ఆనందాల కానుక
సుఖ దుఃఖ సమ్మిళిత నాటిక
అరాచారాల్ని పాతరేసే పాదుక
శ్రీ శోభకృత్ సుగంధాల వీచిక !.
మట్టితడి ఆవిరైపోయి?
పచ్చనాకులు పాలిపోయి?
ఎండుటాకులై ఎగిరిపోయి?
బోసి పోయే కొమ్మ రెమ్మలు..
ఆమని దయచేయడమేగా..
ప్రకృతి నేర్పే బతుకు పాఠం !.
గుత్తులు గుత్తులుగా మావిళ్లు..
రాలిన చోటే మె?లిచే చివుళ్లు..
లేత చిగుర్లను ముద్దాడే కోయిళ్లు..
నిండా తీపి రసపు చెరుకు గడలు..
వేప కొమ్మల్లో నవ్వుల పువ్వులు..
షడ్రుచుల జీవనతత్వ సరాగాలు !.
పంటల ప్రసవ విరామానంతరం..
నేలతల్లి మళ్లీ మె?లకెత్తే సన్నాహాలు
చలికి వీడ్కోలు పలికి వెచ్చదనానికే..
వృక్షాల హరిత కిరీటాల శిరస్సులు
శిశిరానికే పాదాక్రాంతమైన దశలు
ఉగాది పర్వదిన శోభకృత్ లీలలు.. !
చురుకెక్కిన చమురు ధరాఘాతాలు
పుతిన్ బాంబుకు పేలిన గ్యాస్ బండలు
అనాధ కర్షకుల అప్పుల కుప్పల తిప్పలు
అసంబద్ధ అనారోగ్య వాతావరణ మార్పులు
క్షిపణిలా చుక్కలనంటిన సరుకుల ధరలు
ఓటు చుట్టు కీచక నీచ రాజకీయ భ్రమణలు
శుభకృత్ లోంచి శోభకృత్‌లోకి అడుగులు
పేల్చాలి విధ్వంసకర అశుభ ఆటలు !

- డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## ఆత్మ జ్యోతి వెలిగినప్పుడే-!

మనస్సు నిండా
ఈర్ష్యా ద్వేషాలనే
మలినాలను నింపుకుని
ఎన్ని దీపాలను వెలిగించినా
ఏం లాభం?
అంతరంగంలోని
ఆరుగురు నరకులను
అంతం చేసుకోకుండా
ఎన్ని టపాసులు కాల్చినా
ఏం లాభం?
అధర్మంగా సంపాధిస్తూ
దాన ధర్మాదులు చేయకుండా
ఎన్ని ధనలక్ష్మిల పూజలు చేస్తే
ఏం లాభం?
బాహ్య చాపల్యం
చిత్త చంచలత్వంతో
ఎన్ని నోములు
వ్రతాలు పూజలు చేసి నా ఏం లాభం?
ఒంటినిండా కల్మషాల పూతలతో
కవ్విస్తూ కదలాడుతూ
ఇంటినిండా ఎన్ని బంతిపూల
తోరణాలు కట్టినా ఏం లాభం?
ముఖం నిండా స్వార్థం ముసుగేసుకుని
కాకరకాయ మాటల్తో
ఇతరుల బతుకుల్లో నిప్పులు చిమ్ముతూ
ఎన్ని కాకరవత్తులు కాల్చినా ఏం లాభం?
లక్షల విలువల మానవత్వాన్ని
మంట గలుపుతూ
ఎన్ని లక్ష్మి బాంబులు పేల్చినా
ఏం లాభం?
చచ్చిన నరకుని గురించి కాదు
మతాల పేరుతో మంటలు పెడుతూ
కులాల పేరిట కుట్రలు చేస్తూనే
దేశాన్ని ముక్కలు చేస్తున్న
కలియుగ నరరూప నరకులు
అంతమైనప్పుడే నిజమైన దీపావళి
అహంకారాన్ని మాని
అజ్ఞానాన్ని విడనాడి
ఆత్మజ్యోతిని వెలిగించి
ప్రేమానురాగాలనే ప్రసాదాన్ని
పదిమందికి పంచినప్పుడే
అదే !
నిజమైన దీపావళి
పరమపావన
పరంజ్యోతి రూపావళి!
శుభకృత్ నామ దీపావళి..



-డా॥కూర్మాచలం
శంకర స్వామి
7702435110

## షడ్రుచుల పచ్చడిలా

శోభకృత్ నామ సంవత్సరం
నిత్య శోభతో అలరించింది
శుభ కృత్ నామ సంవత్సరం
శుభాలను చేకూర్చాలని వస్తోంది
కలి యుగాన అంతా కల్పితం
కృతం పాపం, కృతం పుణ్యం
శోభకృత్ లో చర్విత చర్వణం
శుభ కృత్ లో మహాద్భుతాల నాసిద్దాం
చిలికి చిలికి గాలి వానలా సాగే యుద్ధం
చొరవజూపి శాంతికపోతంతో ఆపేద్దాం
అణుబాంబుల ఆగడాల నరికడదాం
అగ్రరాజ్యల దురాగతాలకు చరమగీతం పాడుదాం
ఇరు దేశాల మధ్యా సామరస్యం సాధిద్దాం
యుద్ధం మరో యుద్ధానికి పునాది కాకూడదని బోధిద్దాం
రక్తానికి రక్తం పరిష్కారం కాదని సూచిద్దాం
స్మశానంలా మారిన నగరాలను పునర్నిర్మిద్దాం
శుభ కృత్ నామ సంవత్సరాన్ని శుభాలతో నింపుదాం
షడ్రుచుల పచ్చడిలా విభేదాల నన్నింటినీ మిళితం చేద్దాం
అందరికీ ఉగాది పచ్చడి పంచి పెడదాం
తర తమ విభేదాలనన్నింటినీ విడిచి పెడదాం
సర్వమాన్య సౌభాతృత్వంతో నూతన వత్సరమంతా
శాంతి, సహనం,
సౌభాగ్యాలతో బ్రతుకుదాం



-యం. బాల గంగాధరయ్య,
9849546762

## వచ్చి పోయే ఉగాది లా మిగలకమ్మా

శుభకృత నామ సంవత్సరం వచ్చింది
సరదాల సందళ్ళు తెచ్చింది
ఇళ్ళు లోగిళ్ళు కళకళలాడగా
ఊరంతా ఉత్సాహం నింపేసింది.

మామిడి తోరణాలతో
కోకిలమ్మ సరాగాల తో
షడ్రుచుల పచ్చడి తో
పంచాంగ శ్రవణాలతో
కవి సమ్మేళనాలతో
జరుపుకుంటారు మెండుగా
తెలుగు వారి గుండెల నిండుగా.

మనుషుల మధ్య అంతరాలను
అంతం చేయడానికి
విషపు జల్లుల విన్యాసాలను ఆపడానికి
మనసు పొరల్లోని మలినాలను
కుటిల కుతంత్రాలను కడిగెయ్యటానికి
మంచు తెరలను తొలగించే భానుడిలా
నవ కోణంతో రావమ్మా!
ఆశల హరివిల్లును తేవమ్మా .

బడుగుల బతుకు చిత్రం మార్చడానికి
హాలికుల మోముల్లో చిరుదివ్వెలు వెలిగించడానికి
నిరుద్యోగుల నిరాశ కొలను లో
కలువ కుసుమమై వికసించడానికి
సూర్య తేజమై రావమ్మా !
సమస్యల కొడవళ్ళను తెంచవమ్మా !

మగువలపై మూకదాడులను నిలపడానికి
సుదర్శన చక్రమై రావమ్మా
సర్వజనులకు సిరులు కురిపించే
లక్ష్మి దేవతై రావమ్మా
సబ్బండ వర్గాల ఆశాకిరణమై
అందరి మెడలో ఆభరణమై మెరువమ్మా !
వచ్చి పోయే ఉగాది లా మిగలకమ్మా
( శుభకృత నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని )





- తాటిపాముల రమేష్
7981566031

